## పెన్నహోబిళంలో వైభవంగా శ్రీవారి పల్లకీ ఉత్సవం

### -భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడిన క్షేత్రం

ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త



లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం

జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఉరవకొండ మండల పరిధిలోని పెన్న హోబిళం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం ఆశ్వీయుజ పంచమి శనివారం సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎస్.తిరుమలరెడ్డి పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. క్షేత్రం నుండి నీరు పారుతుండటంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొని నీటి జలపాతాల అందాలను తిలకిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్పకు సన్మానం

### -ఉరవకొండ సీఎస్ఐ చర్చిలో అట్టహాసంగా కార్యక్రమం

ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త



మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్పను సన్మానించిన దృశ్యం

లత్తవరం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్పకు శనివారం ఘన సన్మానం జరిగింది. ఉరవకొండ పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో బోదపాటి గోవిందప్పకు లత్తవరం గ్రామానికి చెందిన మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టు సాధించిన సందీప్, వివిధ చర్చీల ఫాస్టర్లు షాలువాకప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లత్తవరం, బళ్లారి, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఫాస్టర్లు ప్రసాద్, దేవదానంబాబు, రబ్బుని, రవిబాబు, సీఎస్ఐ చర్చి సంఘం పెద్దలు మీనుగ భాస్కర్, సాకే భాస్కర్, సాకే డేవిడ్, ఎం.ఎన్.షాహీన్, ఆర్.భాస్కర్, ఎస్.జగదీష్, లత్తవరం మాజీ ఎంపీటీసీ మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి సంఘంలో ఉన్నతమైనది

### - పదవీ విరమణ సన్మాన సభలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు

అగళి, అక్టోబర్ 11 ప్రభాతవార్త

మండల పరిధలోని మధూడి ఉన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్ తిమ్మప్ప, మ్యాథ్స్ అసిస్టెంట్‌గా దాసేగౌడ్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చెందారు. ఈ పదవీ విరమణ సన్మాన సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి హాజరైన ప్రసంగించారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని అందుకు వీళ్లిద్దరూ బోధన పరంగా బాగా విద్యార్థులకు బోధించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని, వీరు సుదీర్ఘంగా ఉపాధ్యాయ వృత్తిలో 36 ఏళ్లపాటు సేవలు అందించారని వీరి చేత విద్యనభ్యసించిన విద్యార్థులు ఐపిఎస్‌లుగా, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, ఉపాధ్యాయులుగా, లాయర్లుగా ఉన్నారని గుండుమల తిప్పేస్వామి అన్నారు. పాత విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తిమ్మప్ప, దాసేగౌడ్‌లతోపాటు వారి కుటుంబ సభ్యులను పూలమాలలతో, దుశ్శాలువాతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శాలువాలు, పుష్పగుచ్చాలు, పూలమాలలతో సన్మానించారు. వీరి అడుగు జాడల్లో విద్యార్థులు నడవాల్సి ఉందని, ఎంతో మంది భావి భారత పౌరులుగా తీర్చి దిద్దారని వీరి సేవలను కొనియాడారు. నిగర్వులుగా, శాంతికాములుగా ఉండి మంచి బోధన అందించారని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, మార్కెట్ యార్డు ఛైర్మన్ గురుమూర్తి, వక్కలిగ కార్పోరేషన్ ఛైర్మన్ లక్ష్మినారాయణ, నారాయణప్ప, మండల కన్వీనర్ నరసప్ప, అడిషనల్ ఎస్‌పి రాఘవేంద్ర, జడ్పిటిసి ఉమేష్, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, కన్వీనర్ తిప్పేస్వామి, తదితరర ఉపాధ్యాయులు, బంధువులు హాజరయ్యారు.

## మలేరియాపై హాస్టల్ విద్యార్థులకు అవగాహన

అగళి, అక్టోబర్ 11 ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివానంద

అగళి బిసి బాలుర వసతి గృహంలో డాక్టర్ శివానంద మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ షమివుల్లా ఆధ్వర్యంలో పిల్లలకు అవగాహన కల్పించారు. సమావేశంలో డాక్టర్ శివానంద మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యాధిరాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాలని, అనంతరం పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. వాతావరణ మార్పుల ద్వారా వ్యాపించే వ్యాధుల గురంచి, దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ వ్యాధుల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వడ్రహట్టి గ్రామంలో మలేథియన్ మందు మూడవ విడత స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సింకిందర్ బాషా, ఆరోగ్య కార్యకర్త గంగిరెడ్డిలు పాల్గొన్నారు.

## రాబోయే దీపావళికి పలు జాగ్రత్తలు సూచించిన రామగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ

రామగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త

బాణసంచా పేల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు పాటించాలని రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. రాబోయే దీపావళి పండుగను ఉద్దేశించి ప్రమాదాలు జరగకుండా పలు సూచనలు, జాగ్రత్తలు ప్రజలకు సూచించారు. అలాగే ఎవరైనా బాణసంచా అమ్మకానికి తాత్కాలిక లైసెన్స్ పొందాలని యోచిస్తే, అది తప్పనిసరిగా జిల్లా కలెక్టర్/తహసీల్దార్/ఫైర్ డిపార్ట్మెంట్ ద్వారా మంజూరు చేయబడిన ఎల్-5 లైసెన్స్ ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా షాపులు నిర్వహించడం చట్టపరంగా నేరం, అటువంటి షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. కాబట్టి బాణసంచా వ్యాపారులు ఈ విషయాన్ని గమనించి చట్టబద్ధంగా వ్యవహరించవలసిందిగా కోరడమైనది. ప్రమాదం జరిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా 100/108 కు సమాచారమివ్వాలని ఆయన తెలిపారు.

## శ్రీరామస్వామి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.

కనగానపల్లి అక్టోబర్ 11 ప్రభాతవార్త



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.

మండలంలోని కొండపల్లి గ్రామంలో నూతనంగా వెలిసిన శ్రీరామ స్వామి ఆలయంలో శనివారం రాప్తాడు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశ్రీశ్రీ సీతా సమేత రామస్వామి, లక్ష్మణ్, ఆంజనేయ స్వామి సహిత, శ్రీ గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నవగ్రహ శిలా ధ్వజ శిఖరకలశం, నాగుల ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకురాలు గంగుల భానుమతి, జడ్పిటిసి మారుతి, నాయకులు వలగొండభాస్కర్, గంగులసుధీర్‌రెడ్డి, నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాత కార్డు నుంచి విభజన అయిన రేషన్ కార్డు నెంబర్లు వచ్చాయి కానీ రేషన్ రావడం లేదు

కనగానపల్లి, అక్టోబర్ 11 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్మార్ట్ రేషన్‌కార్డులకు శ్రీకారం చుట్టింది. మండలంలో సెప్టెంబర్ 15 నుంచి పాత రేషన్‌కార్డుల స్థానంలో కొత్త రేషన్ స్మార్ట్ కార్డులను ఇప్పటికే సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తున్నారు. అయితే ఇందుకు సంబంధించిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులు ఇప్పటికి రాలేదు. రేషన్‌కార్డు లబ్దిదారులు సచివాలయ సిబ్బందిని అడిగితే త్వరలో వస్తాయని సమాధానాలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పాత రేషన్‌కార్డులో ఉండి పెళ్లి అయిన వారు, కుటుంబ సభ్యులు అధికంగా ఉన్నవారు విభజన (పాత రేషన్‌కార్డులోని కుటుంబ సభ్యుల నుంచి బయటికి వచ్చి)కొరకు బయటికి రావడంతో వారికి సైతం రేషన్‌కార్డులు ఇంకాను రాలేదు. ఆన్‌లైన్‌లో మాత్రం నెంబర్‌ను చూపుతోంది. దీంతో లబ్దిదారులు సచివాలయం వద్దకు వెళ్తే వారు నూతనంగా ఏర్పడిన రేషన్‌కార్డు నెంబర్‌ను, అందులో ఎవరెవరు విభజన చెంది ఒక కుటుంబంగా ఏర్పడ్డారన్నది మొత్తం ఆన్‌లైన్‌లో చూపుతోంది. అయితే ఇదే నెంబర్ తీసుకుని వెళ్లి రేషన్ వేయమని రేషన్ డీలర్ వద్దకు వెళ్తే అక్కడ బయోమెట్రిక్‌లో మీ నెంబర్ చూపడం లేదని, ఇంకా మీకు బియ్యం రాలేదని చెబుతున్నారు. సచివాలయంలోని అధికారులతో అడిగితే మీకు ప్రభుత్వం ఇంకా రేషన్ మంజూరు చేయడం లేదు, ఇక్కడ చూపించినా.. రేషన్ షాపు డీలర్ల వద్ద మీ నెంబర్, పేర్లు చూపవని చెబుతున్నారు. ఇటీవల ఉన్న పాత కార్డు నుంచి బయటికి వచ్చాము కదా మాకు సంబంధించిన బియ్యం ఎందుకు రావడం లేదని లబ్దిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నెంబర్ వచ్చి మూడు నెలలు అవుతున్నా లబ్దిదారులకు బియ్యం మాత్రం అందడం లేదని వాపోతున్నారు. పాత రేషన్‌కార్డు నుంచి విభజన చెందినదే కదా ఇంతకు మునుపు పాత కార్డులో ఉన్నప్పుడు తీసుకున్న బియ్యం ఇప్పుడెందుకు రావడం లేదని లబ్దిదారులు రేషన్ డీలర్లతో వాదిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వేయని మూడు నెలల బియ్యంతోసహా మాకు అందజేసే విధంగా చొరవ చూపాలని కార్డు లబ్దిదారులు కోరుతున్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

బత్తలపల్లి, అక్టోబర్ 11 ప్రభాతవార్త



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

చిత్రావతి నది పరివాహక ప్రాంతం నుండి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. శనివారం వేకువజామున రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మండలంలోని జ్వాలాపురం క్రాస్ వద్ద ధర్మవరం ఆర్డీవో మహేష్,రెవిన్యూ సిబ్బంది, బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్,పోలీస్ సిబ్బందితో కలిసి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

## కూచపూడి నాట్యం నేర్చుకొనే విద్యార్థినీలు నూతన ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి...!

ధర్మవరం రూరల్ అక్టోబర్ 11 ప్రభాతవార్త

యోగివేమన యూనివర్సిటీ సిడిఓఈ, కడప వారి ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో కూచిపూడి కళా కేంద్రం ద్వారా నూతన విద్యార్థినీలకు నాట్యం నేర్పించబడునని నాట్యం నేర్చుకొనగల విద్యార్థినీలకు నూతన ప్రవేశ దరఖాస్తుకు ఆహ్వానిస్తున్నట్లు వై వియూనివర్సిటీఅడ్వైజర్ కళాకేంద్రం గౌరవ సలహాదారుడు ప్రొఫెసర్ కృష్ణమూర్తి, నాట్య గురువులు కీర్తన ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఎస్‌బి కాలనీ యందు కూచిపూడి కళా కేంద్రం నందు కూచిపూడి భరతనాట్యం యూజీ, పీజీ, మరియు బిఈఏ, విద్యార్థినీలకు నేర్పించి వై వి యూనివర్సిటీ ద్వారా నృత్య సంగీతంలో సర్టిఫికెట్ పొందవచ్చని వారు తెలిపారు. కూచిపూడి కళా కేంద్రం నందు నూతన ప్రవేశానికి ఆసక్తి కల విద్యార్థినీలు ఈనెల 20వ తారీకు లోపు నేరుగా కూచిపూడి కళా కేంద్రం నందుకానీ లేదా ఈ క్రింది తెలిపిన ఫోన్ నెంబర్ల ద్వారా గాని సంప్రదించి 9493162544, 94402099 55, 6300157738, దరఖాస్తు చేసుకోవచ్చని కూచిపూడి కళా కేంద్రం సెక్రటరీ మంజుల తెలిపారు.

## పంటలు సాగు చేస్తే 24 గంటలు గస్తీ కాయాల్సిందే



పంట పొలాల పై వాలిన జింకలు

రొళ్ల అక్టోబర్11 ప్రభాతవార్త:

మండలంలో జింకల బెడద తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. జింకల కోసం అటవీ ప్రాంతం ఉన్న అటవీ శాఖ అధికారులు పట్టించు కోకపోవడంపై రైతు పంట పొలాలపై వాలి తీవ్ర నష్టం వాటిల్లోతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని ఆవినకుంట, హనుమంతనపల్లి,వడ్రహట్టి, హున్సే కుంట, మల్లీన మడుగు,ఎం.రాయపురం, తదితర గ్రామాల్లో జింకలు బెడద అధికమవడంతో రైతుల పంటలకు నష్టం కలిగిస్తున్నాయి.జింకలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రతి ఏటా పంటలు జింక పాలవుతున్నాయని పెట్టుబడి సైతం రావడం లేదని, రైతులు వాపోతున్నారు.గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేయాలంటే 24 గంటలు గస్తీ కాయాల్సిందే. అన్నం తినడానికి ఇంటికి వస్తే చాలు జింకలు పంటను నాశనం చేస్తున్నాయి. దీంతో పంటలు సాగు చేసిన రైతులు ఒక జట్టుగా ఏర్పడి పంటలను కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు పొలాల దగ్గరే ఉంటున్నారు. జింకలను బెదిరించినా ఫలితం ఉండడం లేదని, ఒక్కసారిగా మందలుగా వచ్చి పంట పొలాలను నాశనం చేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.పక్కనే అటవీ ప్రాంతం ఉండడంతో జింకల ఆవాసానికి అనుకూలంగా ఉంది. జింకలకు ఏదైనా హాని తలపెడితే అధికారులు కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పడమే తప్ప, జింకలను అదుపు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హాజరైన కస్తూరిబా పాఠశాల విద్యార్థులు

### - ఆడపిల్లల రక్షణ సమాజం బాధ్యత - సీడీపీఓ జయంతి

శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) అక్టోబర్ 11 ప్రభాతవార్త:





పోషకాహార విలువల గురించి వివరిస్తున్న దృశ్యాలు



శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ జిల్లా అధికారిణి ఆదేశాల మేరకు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం శనివారం కస్తూరిబా పాఠశాల, జగరాసుపల్లిలో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా హాజరైన సీడీపీఓ జయంతి మాట్లాడుతూ ఆడపిల్లలు, మగపిల్లలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సమాన అవకాశాలు పొందాలి, ఆడపిల్లలు సాధించలేనిది అంటూ ఏమి లేదు. వారు చదువులో, క్రీడలలో, ప్రతి రంగంలో రాణించగలరు అని పేర్కొన్నారు.అలాగే కిశోర బాలికల పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈరోజు బాలికలే రేపటి తల్లులు కాబట్టి వారు ఆరోగ్యంగా ఉండడం అత్యంత అవసరం అని సూచించారు.ఆడపిల్లలు ఏ సమస్య ఎదురైనా వెంటనే ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలని, బాల్యవివాహాలు జరుగకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఆడపిల్లల రక్షణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.అలాగే ఆడపిల్లలు విద్యతో పాటు ఆర్థిక లావాదేవీలు, సామాజిక అవగాహన వంటి విషయాలలోనూ నైపుణ్యం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ఎస్ ఓ, కేజీబీవీ సిబ్బంది, డీసీపీవో కార్యాలయ సిబ్బంది మేఘన, ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత, అంగన్వాడీ కార్యకర్తలు అరుణ, రమణమ్మ, అరుణమ్మ, చంద్రుబాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోషణ మాహ్ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహార ప్రదర్శనశాలను ఏర్పాటు చేసి వివిధ ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు.

## ఊరూ రా...ఆర్ఎస్ఎస్ శతజయంతి వేడుకలు

గోరంట్ల, అక్టోబర్ 11 ప్రభాతవార్త



శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల మండలంలోని పులేరు గ్రామంలో శనివారం ఆర్ఎస్ఎస్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాలకు ముఖ్యవక్త డాక్టర్‌దేవరస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బూదిలి సంఘ పరిధిలోని పులేరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాల్లో స్థానిక ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో పాటు నాయకులు పాల్గొని శతజయంతి యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వికాసం జిల్లా సంయోజక్ లక్ష్మినారాయణ, ఎస్ఎస్ఎఫ్ కండ ధర్మ ప్రచారక్ హరినాథ్‌రెడ్డిలతో పాటు హరి, సూరి, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో జేవివి ఆధ్వర్యంలో పోస్టర్ల విడుదల

గుత్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తున్నట్లు జిల్లా మాజీ కార్యదర్శి వెంకటరామిరెడ్డి, మండల కార్యదర్శి రంగనాథ్‌లు పేర్కొన్నారు. గుత్తిలో శనివారం విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకై నిర్వహించనున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను విడుదల చేశారు. పాఠశాల స్థాయిలో ఈనెల 18న, మండల స్థాయిలో వచ్చే నెల ఒకటిన, జిల్లా స్థాయిలో వచ్చేనెల 23న ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. తదుపరి ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్రస్థాయిలో పరీక్షలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రెడ్డి, డానియల్, ఓబులరాజు, రవికుమార్, ఖాజాబాష, పోతులయ్య, సలీం, సీతానంద్, శ్రీధర్‌గౌడ్, రామచంద్ర, రామాంజనేయులు, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

గుత్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త



వక్తలు మాట్లాడుతున్న దృశ్యం

నేటి సమాజంలో విద్యార్థులు సానుకూల ఆలోచనలతో, ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లాలని వందేమాతరం రవీంద్ర పేర్కొన్నారు. స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థి ఆలోచించు అన్న అంశంపై ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ జాతీయత నైతిక విలువలు విజయం దిశగా వెళ్లే దృక్పథాన్ని వివరించారు. తమ జీవిత లక్ష్యాలను సాధించేందుకై ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వికె పద్మావతి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్‌బాషా, లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

## పక్కీరప్ప కాలనీలో కుక్క స్వైర విహారం

### -ఐదుగురుపై దాడి -ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

గుంతకల్లు, అక్టోబర్ 11 ప్రభాతవార్త



చేతికి గాయాలైన దృశ్యం (ఇన్‌సెట్‌లో) గాయాలను చూపుతున్న వర్ష

పట్టణంలో కుక్కల బెడద ఎంత తీవ్రంగా ఉందో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనే నిదర్శనం. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఓ పిచ్చికుక్క ఏకంగా ఐదుగురుపై దాడి చేసి గాయపరిచింది. ఆరేళ్ల వర్ష, నాగరాజు, గొల్ల చిట్టెమ్మ, వేణమ్మ, గీత కాలనీలోని పాములపుట్ట సందులో ఇంటి నుండి బయటకు వస్తుండగా పిచ్చికుక్క వారిపై దాడి చేసింది. బాధితులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. కుక్కల బెడద నుండి కాపాడాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నుండి కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## బాల్య వివాహాలు... భవిష్యత్తుకు శాపాలు

### -కస్తూరిబా స్కూల్లో...బాలిక దినోత్సవ వేడుకలు

### -సూపర్‌వైజర్ మంజుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



గోరంట్ల, అక్టోబర్ 11 ప్రభాతవార్త

బాలికలకు 18 ఏళ్ల వయసు పూర్తయ్యాకే పెళ్లి ఈడు వస్తుందని ఆ తరువాత పెళ్లి చేసుకోవడం వల్ల ఆ బాలికకు భవిష్యత్తులో ఎలాంటి శారీరక ఇబ్బందులు రావని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మంజుల విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని గోరంట్ల మండలంలోని ఖాజాపురం పద్ద గల కస్తూరిబా గురుకుల పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఓ శాంతలక్ష్మి ఆదేశాల మేరకు పాఠశాల ఎస్ఓ శిరీష నేతృతంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ బాలికల హక్కులు సమాజంలో తనకున్న, చదువుకున్న విలువ, చిన్న వయసులో వివాహాలు చేసుకుంటే జరిగే అనర్థాలు వంటి అనేక విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం



మాట్లాడుతున్న రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్

రామగిరి, అక్టోబర్ 11 ప్రభాతవార్త

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రామగిరి పోలీస్‌స్టేషన్ తరఫున ఎస్ఐ జి.సుధాకర్ యాదవ్ స్థానిక కెజిబివి హాస్టల్‌ను సందర్శించి అక్కడ నివసిస్తున్న విద్యార్థినులతో స్నేహపూర్వకంగా మాట్లాడి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలికల రక్షణ, సమాజంలో మహిళల భద్రత, పోక్సో చట్టం ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. అలాగే సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ భద్రత విషయాలపై వారికి విస్తృతమైన అవగాహన కల్పించాం. మొబైల్, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే ప్రమాదాలను గుర్తించటం, అనుమానాస్పద లింకులు లేదా అనుచిత సందేశాలు వచ్చినప్పుడు వెంటనే తల్లిదండ్రులు, టీచర్లు లేదా పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని సూచించాం. చిన్న వయస్సులో జరిగే బాల్యవివాహాలు వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై వారికి ఉదాహరణలతో వివరించడం జరిగింది. బాలికలు తమ విద్యను పూర్తి చేసుకుని స్వతంత్రంగా ఎదగడం ఎంత ముఖ్యమో వారికి స్పష్టంగా వివరించాం. పోలీస్ విభాగం తరఫున బాలికలకు ఎప్పుడు, ఎక్కడ అవసరం అయినా రక్షణ అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశాం. బాలిక సురక్షితం సమాజం సుస్థిరం" అనే నినాదంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, కేర్‌టేకర్లు, సిబ్బంది పాల్గొని, పోలీస్ శాఖ చేస్తున్న ఈ సామాజిక అవగాహన కార్యక్రమానికి అభినందనలు తెలిపారు.

## సికె పల్లిలో ఘనంగా వాల్మీకి జయంతోత్సవం

చెన్నేకొత్తపల్లి, అక్టోబర్ 11 ప్రభాతవార్త



వాల్మీకి విగ్రహానికి పూలమాలను వేసిన దృశ్యం

మండల కేంద్రమైన చేన్నేకొత్తపల్లి, వాల్మీకి సోదరులు, వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు శనివారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి ఉదయాన్నే ఎంతో భక్తిశ్రద్ధలతో వాల్మీకి సోదరులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం మహిళలు పెద్ద ఎత్తున జ్యోతుల బోనాలను తల పైన ఎత్తుకొని గ్రామంలోని,పురవీధుల గుండా ఊరేగింపుగా వాల్మీకి విగ్రహం వద్దకు కొని వాల్మీకి మహర్షికి తల పుష్ప తాంబూలాదులు కాయ కర్పూరాలను సమర్పించి బోనం నైవేద్యంగా పెట్టి మొక్కులను తీర్చుకున్నారు, అనంతరం భక్తులకు ప్రజలకు అన్నప్రసాదాలు, నిర్వహించి, సాయంత్రం



దీపాలను మోస్తున్న వాల్మీకి ఆడ పడుచులు

వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ట్రాక్టర్ పై గ్రామంలోని పురవీధుల గుండా మంగళ వాయిద్యాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా కేజీబీవీలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం

కనగానపల్లి అక్టోబర్ 11 ప్రభాతవార్త



మాట్లాడుతున్న బాలల సంరక్షణ సమితి వర్కర్ ఆనంద్.

మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్ నందు శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి (విషన్ వాత్సల్య) సోషల్ వర్కర్ ఆనంద్ మాట్లాడుతూ అమ్మాయిలు ఎందులోనూ తక్కువ కాదని నిర్దిష్టమైన లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని తెలియజేశారు, ప్రస్తుతం సమాజంలో బాల్యవివాహాలు మరియు సైబర్ నేరాలు మరియు బాలికల పైన వేధింపులు ఎక్కువ ఉన్నాయని వాటి నుంచి బయట పడేందుకు అవగాహన ఉండాలని తెలియజేశారు, అనంతరం అంతర్జాతీయ బాలిక దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సూపర్వైజర్ ప్రశాంతి, ఉపాధ్యాయునులు రమాదేవి,రాజేశ్వరి, అంగన్వాడి టీచర్ లక్ష్మీదేవమ్మ,రమాదేవి, విద్యార్థునులు పాల్గొన్నారు.

# పిఎం ధనధాన్య కృషి యోజన పథకం రైతులకు ఎంతో ఉపయోగకరం

- బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ జంగంరెడ్డి అంకాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అంకాల్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

పిఎం ధనధాన్య కృషి యోజన పథకం రైతులకు ఎంతో ఉపయోగకరమని బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ జంగంరెడ్డి అంకాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాడిపత్రి రూరల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రోజు ప్రధాని నరేంద్రమోడీ పిఎం ధనధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించి దేశంలోని దాదాపు వంద జిల్లాలను ఎంపిక చేయడం అందులో అనంతపురం జిల్లాను కూడా చేర్చి జిల్లాలోని రైతులందరికీ బడుగు బలహీన వర్గాల అందరికీ మేలు జరిగేలా ఈ పథకం ప్రారంభించారన్నారు. పశుసంపద మత్స్య సంపద పాడి పరిశ్రమ వీటికి కూడా సాయం అందజేసి వ్యవసాయ ఆధారిత రైతులకు వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఇందులో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రూరల్ అధ్యక్షుడు బిసి శేషానందరెడ్డి, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు సింగరి లక్ష్మీనారాయణ, మాజీ మండల అధ్యక్షులు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి శివ, సంజీవరాయుడు పాల్గొన్నారు.

# ధర్నాను విజయవంతం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**యాడికి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దేశ అత్యున్నత న్యాయస్థానంలో దళితుడైన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్.గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునివ్వడంతో తాడిపత్రి నియోజకవర్గం పర్యటనలో భాగంగా యాడికి ఎంఆర్‌పిఎస్ ఎంఎస్‌పి అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం యాడికి పట్టణంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి సభాధ్యక్షులు యాడికి మండల ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు బాలు మాదిగ వహించగా యాడికి మండల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు మాదిగ విశిష్ట అతిథులుగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ మాదిగ యాడికి మండల ఉపాధ్యక్షులు చిరంజీవి మాదిగ, యాడికి మండల గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు మాదిగ, జిల్లా ఇన్‌చార్జ్ ముమ్మిడి వరకు చిన్న సుబ్బారావు మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ అనంతపురం జిల్లాలో ఈ 13వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదేవిధంగా ఈనెల 17న అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు జరపాలని ఈనెల 23 చలో అమరావతి భారీ ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ గాంధీ మాదిగ, తాడిపత్రి నియోజకవర్గ సీనియర్ నాయకులు పుల్లయ్య మాదిగ, యాడికి మండల సీనియర్ నాయకులు నరసింహులు మాదిగ, సూర్యుడు మాదిగ, కుళ్లాయప్ప మాదిగ, రామాంజనేయులు మాదిగ, చిన్నరాముడు మాదిగ, లచ్చుంపల్లి రంగస్వామి మాదిగ, సూర్యనారాయణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

**పుట్లూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

మండలంలోని సూరేపల్లి గ్రామంలో వెలసిన అతి పురాతనమైన శ్రీభోగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారుల సమక్షంలో గ్రామప్రజలు శనివారం ప్రారంభించారు. దాదాపు 1 కోటి రూపాయల కామన్ గుడ్ ఫండ్స్ మంజూరు కాగా పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ అధికారులు సుబ్రహ్మణ్యం, మురళికృష్ణ, సెక్రటరీ కృష్ణవేణి, విఆర్‌ఒ నరసింహులు, సురేపల్లి గ్రామస్తులు, తాడిపత్రి సివిల్ సప్లై డిప్యూటి తహశీల్దార్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నూతన కమిటీ ఎన్నిక



కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

భారతీయ జనతాపార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పివి ప్రతాప్‌రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో నూతన కమిటిని ఎన్నుకున్నారు.

ఇందులో భాగంగా బిజెపి పట్టణ అధ్యక్షులుగా చెన్నా రంగనాయకులు, పట్టణ ప్రధాన కార్యదర్శులుగా జూటూరు ఓబిరెడ్డి, ఎం. వెంకటసుబ్బయ్య, పట్టణ ఉపాధ్యక్షులుగా డి.ఓబులేసు (వంశీ), అట్ల రాజశేఖర్‌రెడ్డి, నడిమిదొడ్డి నాగమునయ్య, ఎం.నాగేశ్వరరావు, హెచ్‌ఆర్ ఆనంద్‌రెడ్డి, జి.ఎస్. ఆనంద్‌రావు, పట్టణ కార్యదర్శులుగా ఎం.నందగోపాల్, జి.భాస్కర్, డి.ఈశ్వరయ్య, బి.చిన్నబయన్న, కోమలి శివ, రంగ, ట్రెజరర్ ఎల్.ఈశ్వర్‌రాజు, బిజెపి తాడిపత్రి పట్టణ ఎస్‌సి మోర్చా అధ్యక్షులుగా బి.రంగా, బిజెపి తాడిపత్రి పట్టణ ఎస్‌టి మోర్చా అధ్యక్షులు ఏ.సురేష్, యువమోర్చ పట్టణ అధ్యక్షులుగా ఎం.మధు, బిజెపి తాడిపత్రి పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు హెచ్.అమరావతి, మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షులుగా ఎస్.అస్లాంబాషను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మాజీ నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రయ్య, ఎట్టి శివయ్య, ఎస్‌సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మందాల శివ, తదితరులు పాల్గొన్నారు.

# ఆకుతోట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**పెద్దవడుగూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



ఆకుతోటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఆకుతోట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఓ,నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం వారు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని ఆకుతోటలను పరిశీలించి ఆకుతోట రైతులతో మాట్లాడారు. ఆకుతోట రైతులకు 30 సట్టలు ఆకులు 200 రూపాయల ధర వుందని ఈ విధంగా ఉంటే గిట్టుబాటు కాదని 30 సట్టలు ఆకులు 800 రూపాయలు ధర ప్రకటించాలన్నారు. ఆకుతోటలను పరిశీలించడానికి వ్యవసాయాధికారులు ఎవరు రావడం లేదని తమకు మాకు సూచనలు సలహాలు కూడా ఇచ్చేవారు లేరని ఆకుతోట రైతులు పేర్కొన్నారు. తక్షణమే అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించి ఆకుతోట రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలుపుకొని జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దస్తగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి, రైతు సంఘం అధ్యక్షులు మద్దిలేటి, పెద్దయ్య, రైతు నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పుష్పాలంకరణలో శ్రీరంగనాథుడు



**తాడిపత్రిరూరల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలం ఆలూరుకోనలో వెలసిన శ్రీరంగనాథస్వామి శనివారం ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు సుబ్బారావు, రంగనాథశర్మ, ఇంద్రకుమార్‌శర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామిని వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, ఆకుపూజలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కోనలో వెలసిన శ్రీఆంజనేయస్వామి, శ్రీషిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు కోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, సిబ్బంది కాశీ పాల్గొన్నారు.

# పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

**నల్లచెరువు అక్టోబర్ 22 ప్రభాతవార్త**



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు నాగరాజు దాస్

మండల పరిధిలోని పుణ్యక్షేత్రమైన శ్రీ పాలపాటిని ఆంజనేయస్వామి దేవస్థానం నందు శనివారం సందర్భంగా దేవాద య ధర్మాదాయ శాఖ ఆలయ అర్చకులు నాగరాజు దాసు. సాయి కిరణ్. ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి ఉదయ అనంతరం గంగాజల స్నానాలు గంధం కుంకుమ పాలాభిషేకం తమలపాకులతో ఆకు పూజలు నిర్వహించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి స్వామివారి దర్శించుకుని తీర్థ అన్నప్రసాదాలు సేవించారు

# గుండువారిపల్లిలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

**అమడగూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

ఆమడగూరు మండలం గుండువారిపల్లి కెజిబివి పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గంగాదేవి ఆధ్వర్యంలో శనివారం అంతర్జతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్‌పిటిసి కవితా శివశంకర్‌రెడ్డి, తహశీల్దార్ రామనాథరెడ్డి, ఎంపిడిఒ మునెప్పలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాలికలు కేవలం కొన్ని రంగాలకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ ముందుండాలన్నారు. బాలికలు ఇప్పటి నుంచే ఉన్నత విద్యా అవకాశాలును అందిపుచ్చుకుని ఐఏఎస్, ఐపిఎస్, ఆర్మీ, స్పోర్ట్స్ తదితర రంగాలలో ముందుకెళ్లాలన్నారు. మహిళలు దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంటున్నారన్నారు. మహిళలు ఎంతో కష్టమైన రంగాల్లోను ఎంచుకొని ముందుకు పోవడం గొప్ప విషయమన్నారు. బాలికలకు ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి సదుపాయాలు, సంక్షేమ ఫలాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఆ కుటుంబం, ఆ గ్రామం, ఆ ప్రాంతం, అభివృద్ధి చెందుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా బాలురను ఒకరకంగా బాలికలను ఒక రకంగా చూడకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని తల్లిదండ్రులకు వారు సూచించారు. ప్రతి బాలిక తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పట్టుదల, కృషి, నమ్మకంతో ముందుకు వెళితే ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని వారు పేర్కొన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంతో ఏర్పాటు చేసిన నవధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఒ జిలాన్‌బాషా, ఎస్‌ఓ వెంకటరమణమ్మ, జెడ్‌పిటిసి కవితా శంకర్‌రెడ్డి, ఏపిఎం భారతి, హెడ్ కానిస్టేబుల్ గౌడ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్లు, బాలింతలు, గర్భవతులు, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు

**యల్లనూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

సురేష్ అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. లింగాల మండలం అంకేవానిపల్లి గ్రామానికి చెందిన మన్నెల సురేష్‌కు యల్లనూరు గ్రామానికి చెందిన పెద్దన్నకు మధ్య మనస్పర్థలు ఉండేవన్నారు. సురేష్ తన స్వగ్రామం నుండి చిలమకూరు గ్రామానికి వచ్చి తిరిగి తన గ్రామానికి వెళుతుండగా యల్లనూరు గ్రామానికి చెందిన పెద్దన్న, పెద్దిరాజు, నరేష్, వెంకటరమణ అనే వ్యక్తులు సురేష్ వెళుతున్న మోటార్‌సైకిల్‌ను యల్లనూరు గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద అడ్డగించి సురేష్‌ను కొట్టి గాయపరిచినారన్నారు. సురేష్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ



డిజిటల్ బుక్ కీ ఆర్ కోడు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నల్లచెరువు అక్టోబర్ 11 ప్రబాతవార్త**

మండల కేంద్రంలోని వైసీపీ పార్టీ మండల కన్వీనర్ మండెం రవికుమార్ రెడ్డి స్వగృహంలో శనివారం కదిరి శాసన సభ సమన్వయకర్త శమక్బుల్ అహమ్మద్ ఆదేశాల మేరకు వైయస్సార్సిపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాల వల్ల మరియు రెడ్ బుక్ అమలులో భాగంగా అన్యాయంగా వైసీపీ నాయకులపై మరియు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపి కార్యకర్తలపై చేస్తున్న దాడులు చేస్తున్న నేపథ్యంలో వారికీ రక్షణ కవచంగా రూపొందించిన డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను నల్లచెరువు మండల కన్వీనర్ శ్రీ మండెం రవికుమార్ రెడ్డి మండల వైసీపీ నాయకులు మరియు కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు. మండల కన్వీనర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొన్న వైసీపీ నాయకులు మరియు కార్యకర్తలకు 2029 లో వైసీపీ పార్టీ అధికారంలోకి రాగానే ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్క వైసీపీ నాయకుడికి మరియు కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పోరెడ్డి వెంకట రెడ్డి,మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్ రెడ్డి,మైనారిటి నాయకులు నజీర్,బోనాల ఖాదర్ వలి,కమ్మవారిపల్లి సూర్య నారాయణ రెడ్డి,శ్రీకంఠ రెడ్డి,మండల వైస్ కన్వీనర్ రఫీ,పూలకుంట సర్పంచ్ యుసఫ్,ఎస్టీ సెల్ కన్వీనర్ హైటెక్ రమణ,తనకల్లు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ,మాజీ సింగల్ విండో డైరెక్టర్ ఆది మూర్తి, మాజీ సర్పంచ్ లు హరి,రమణారెడ్డి, దేవరింటి పల్లి ఖాదర్ వలి, ఇర్ఫాన్,పోరెడ్డి చెన్న కేశవ రెడ్డి,పులిమి వాండ్ల పల్లి చంద్ర మోహన్ రాజారెడ్డి, వాల్మీకి క్రిష్ట,శ్రీనివాసులు, వీవర్స్ కాలనీ అక్బర్, బ్రహ్మానంద రెడ్డి,గోపాల్ యాదవ్,మారిశెట్టిపల్లి రవులు, ఇస్మాయిల్,షేక్షావలి షఫీ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్ తనిఖీ చేసిన సిహెచ్‌ఓ

**నల్లచెరువు,అక్టోబర్ 11, ప్రభాతవార్త**



విద్యార్థులకు ఆరోగ్య పట్ల అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌ఓ రామచంద్రారెడ్డి

నల్లచెరువు మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ నందు సిహెచ్‌ఓ రామచంద్రా రెడ్డి శనివారం బీసీ హాస్టల్ వసతుల పట్ల తనిఖీలు నిర్వహించారు. కుక్ మేన్ల విద్యార్థులు కు వంట చేసే ట ప్పుడు చేతులు శుభ్రముగా కడుక్కోని వంటలు చేయాలని మరియు విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన మరియు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పరిశీలించి వారికి అవగాహన కల్పించారు హాస్టల్స్ లో వంటశాలను బాత్రూములను యొక్క పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులు కు జ్వర దగ్గు పడిశం విరేచనాలు సూచనలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వార్డెన్ సహకారంతో వెంటనే సందర్శిం చాలని తెలిపారు కేజీబీవీ స్కూల్ ను మరియు హాస్టల్ ను సందర్శించి కూర గాయలు వంట చేసే విధానం పరిశుభ్రత గురించి ఆరా తీసి వారికి సూచనలు కల్పించారు ఈ కార్యక్రమంలో నల్లచెరువు పిహెచ్సి సూపర్వైజర్ సుధాకర్ హాస్టల్. సహాయకులు గోవిందరెడ్డి. ఏఎన్ఎంలు పాల్గొన్నారు

# ఘనంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

**తనకల్లు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ అశోక్‌వర్ధన్‌రెడ్డి

తనకల్లు మండలంలో శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి కదిరి నియోజకవర్గ ఇన్ చార్జ్ బిఎస్ మక్బూల్ ఆదేశాల మేరకు దేశాయి సంజీవరెడ్డి నివాసంలో వైసిపి మండల కన్వీనర్ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కన్వీనర్ అశోక్‌వర్ధన్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తనకల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో గర్భవతులు, రోగులకు పండ్లు, బ్రెడ్లు, అందజేశారు. ఈ కార్యక్రమంలో తనకల్లు మండలం వైసిపి నాయకులు దేశీ సంజీవరెడ్డి, హరినాథ్‌రెడ్డి,బిఎస్ కలాం,బిఎస్ నిజాం,ఎంపిటిసిలు హిమదర్‌రెడ్డి, హేమ శేఖర్‌రెడ్డి, రమణ,సర్పంచులు నాగరాజు,గంగాధర్,పూలశంకర, మాజీ సర్పంచు భారతి,ఉపసర్పంచు రమణమ్మ,వైస్ ఎంపిపి హరినాథ్‌రెడ్డి,ప్రకాష్, నరేంద్ర, సూర్యనారాయణ, సానే రమణ, జగదీష్, కుమార్, చంద్ర, సాంబశివా రెడ్డి, కమలాకర్,రమేష్‌నాయక్,ఇక్బాల్,తాహిర్,అమీర్,భారతి,విశ్వనాథ్‌రెడ్డి, కె.లక్ష్మారెడ్డి,మాధవరెడ్డి,లోకేశ్వర్‌రెడ్డి,నాగభూషణ్‌రెడ్డి,తులసమ్మ,బీరప్ప, నరసిం హులు, కుమారు, సాలమ్మ, రమణప్ప, చంద్రశేఖర్ నాయుడు, వెంకటమల్లప్ప నాయుడు, డీలర్ నరసింహులు, చంద్ర, రమణప్ప, హరినాథ్, బాబ్జాన్, రెడ్డప్ప రెడ్డి, రవీంద్రారెడ్డి, విజయకుమార్, ఖాజా, రమణారెడ్డి, సాంబశివారెడ్డి, రాజా రెడ్డి, మాధవరెడ్డి, సుబ్రహ్మణ్యం, అమీర్, ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, ఓబులేసు, శివ శంకర, పర్వీన్‌భాను,ప్రకాష్,నరసింహులు, ఓబులేసు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుమ్మలకొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**అమడగూరు, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

అమడగూరు మండలం తుమ్మల గ్రామం కొత్తపేట సమీపంలోని తుమ్మల కొండ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఒక్కపొద్దుల సందర్భంగా మూడవ శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని అనేకమంది భక్తులు తిరుమలకు వెళ్లలేని పరిస్థితుల్లో తుమ్మల కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించి తమ కోరికలు తీర్చించుకుంటుంటారన్నారు. ముఖ్యంగా కల్యాణయోగం మరియు సంతానయోగం కోసం స్వామివారిని దర్శించుకుని మొక్కు చెల్లిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసమన్నారు. కుటుంబ సమేతంగా భక్తులు వచ్చి తలనీలాలు సమర్పించడం ఇక్కడి ప్రత్యేకత అన్నారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణను టీచర్ మలక మహేశ్వర్‌రెడ్డి, టీచర్ సుజాత కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపిశెట్టి శ్రీనివాసులు, బిల్లూరు మహేశ్వర్‌రెడ్డి, రామనేని రామచంద్ర, సరళమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, ఆదిమూర్తి, రామ్మోహన్, ఈశ్వరయ్య, అర్చకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

-నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, అక్టోబర్ 11 ప్రభాతవార్త**





అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణప్ప (ఫైల్‌ఫోటో), అనంతపురం ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

మండల పరిధిలోని రాకెట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నారాయణప్ప (80) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. వయసురీత్యా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య జయమ్మ, కుమారుడు మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు ఉన్నారు. విషయం తెలియగానే మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అనంతపురంలో ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామరి ్శంచారు. గ్రామంలో మృతదేహాన్ని మాజీ సర్పంచ్ ఎం.అశోక్‌కుమార్, ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు దయ్యాల నాగరాజు తదితరులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

**అగళి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని అగళి కెజిబివి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీలతోపాటు అంగన్‌వాడీ టీచర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ లీలావతి హాజరై ప్రసంగించారు. బాలికల రక్షణకు అందరూ బాధ్యత తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా బాలికల కోసం అన్ని రంగాల్లోనూ చేయూతనిస్తోందని ముఖ్యంగా బాలికల రక్షణ చాలా ముఖ్యమైందని తెలిపారు. పురుషులతోపాటు బాలికల అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే దుష్పరనామాల గురించి వివరించారు. బాలికలు బాగా చదవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ నాగరత్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులుగా ఒకే రోజు చేరారు.. ఒకే పాఠశాలలో పదవీ విరమణ పొందారు

- వీరి సేవలు కలకాలం ఇలాగే ఉండాలి : పూర్వ విద్యార్థులు




పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు, బంధువులు

**అగళి, అక్టోబర్ 11 ప్రభాతవార్త**

ఆ ఇద్దరు ఉపాధ్యాయులు ఒక ప్రత్యేకత. ఉపాధ్యాయ వృత్తిలో ఒకేరోజు జాయిన్ అవడం జరిగింది. బయాలజి స్కూల్ అసిస్టెంట్‌గా తిమ్మప్ప, మ్యాథ్స్ అసిస్టెంట్‌గా ప్రధానోపాధ్యాయులుగా దాసే గౌడ పదవీ విరమణ చెందారు. ఒకే రోజు ఉద్యోగంలో చేరడం, రిటైర్డ్ అవడం ఒకేరోజు జరుగుతోంది. కాని కాకతాలియంగా ఒకే రోజు ఉద్యోగంలో చేరడం, ఒకే పాఠశాలలో పదవీ విరమణ చెందడం కాకతాలియం కాదా. సుదీర్ఘంగా 36 ఏళ్లపాటు ఉపాధ్యాయులుగా బోధన చేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా సదరు ఉపాధ్యాయులు సేవలు ఇలాగే కొనసాగాలని పూర్వపు విద్యార్థులు ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ఎన్నో పాఠశాలల్లో పని చేసి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న ఉపాధ్యాయుల సేవలను సన్మాన సభకు హాజరైన వారు కొనియాడారు.

# ఆవుల దేవర వేడుకల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ









ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న వారు

**రాయదుర్గం రూరల్ అక్టోబర్ 11 ప్రభాతవార్త**

రాయదుర్గం మండల పరిధిలోని కేంచానపల్లి గ్రామంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. శనివారం సాయంత్రం సమయంలో యాదవ సోదరులు జరుపుకుంటున్న ఆవుల దేవర జాతరలో చిన్నపాటి ఘర్షణ కాస్త పెద్దది అయింది. బోయ సామాజిక వర్గానికి చెందిన వారికి గొల్ల సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాలకు ఘర్షణ జరిగి పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో బోయ సామాజిక వర్గానికి చెందిన మురళి మంజునాథ భరత్ లకు తీవ్రంగా గాయాలయ్యాయి. అలాగే గొల్ల సామాజిక వర్గానికి చెందిన వీరేష్ చిన్నక్క రమేష్ సతీష్ గోవిందులు గాయపడ్డారు వీరందరినీ రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న సిఐ జయ నాయక్ తన సిబ్బందిని తీసుకుని కెంచనపల్లి గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు ఈ ఘటనపై పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

